ఉపాధి దూరం.. బతుకు భారం

- కనుమరుగవుతున్న చేతివృత్తులు
- ఉపాధి కోల్పోతున్న చేతివృత్తులు, కులవృత్తులు చేసేవారు

డోన్: ప్రజల జీవనవిధానంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. యాంత్రీకరణ మూలంగా చేతివృత్తులతో తయారయ్యే వస్తువులు కనుమరుగవుతున్నాయి. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, నేసె, చాకలి, నాయీబ్రాహ్మణులు తరతరాలుగా నమ్ముకుని జీవిస్తున్న కులవృత్తులు, చేతివృత్తులకు ఆదరణ కరువైంది. చేసేది లేక ఇతర వృత్తుల్లోకి మారుతున్నారు.

యాంత్రీకరణతో ఉపాధి కరువు

పూర్వం కుండల్లో వండే వంటలు నేడు కుక్కర్లతో వండుతున్నారు. చాకిరేవుల్లో ఉతికే బట్టలను వాషింగ్ మిషన్‌లో ఉతికి ఆరబెట్టుకోవడం జరుగుతోంది. చేనేత కుటుంబాలు చేతినిండా పనిలేక పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంటి గుమ్మాలు, కిటికీలు, ఇతరత్రా ఫర్నీచర్‌తో పాటు వ్యవసాయ యోగ్యమైన వస్తువుల స్థానంలో యంత్రాలు వచ్చేశాయి. రైతుల కోసం విత్తు నాటినప్పటి నుంచి కలుపు తీయడం, మందులు స్ప్రే చేయడం, పంట కోత, నూర్పిళ్లు అయిన తర్వాత ఇంటికి చేరే వరకు సర్వం యాంత్రీకమైంది. గ్రామీణ జీవన విధానంలో పెనుమార్పులు వచ్చాయి. పల్లెల్లో మచ్చుకు కూడా చేతివృత్తులు, కులవృత్తులు కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు.



దోన్ వ్యవసాయ మార్కెట్‌లో పనిముట్లను విక్రయిస్తున్న దృశ్యం



సంతమార్కెట్‌లో మట్టి కుండలు విక్రయిస్తున్న కుమ్మరి

పూట గడవడం కష్టం



గ్రామీణ ప్రాంతాల్లో అన్ని పనులకు అవసరమైన కొడవళ్లు, గొడ్డళ్లు, సూరకత్తులు, ఇలకత్తులు వినియోగించడం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో వీటిని తయారుచేసే మా లాంటి చేతివృత్తుల వారికి పూటగడవడం కష్టమైంది. రేయింబవళ్లు కష్టపడ్డా కడుపు నిండడం లేదు. మాలాంటి చేతివృత్తుల వారికి ప్రభుత్వాలు ఆపన్నహస్తం అందించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–కమ్మరి వీరేష్, వ్యాపారి, డోన్

చేయూతనందించాలి



గ్రామీణ జీవన విధానంలో మమేకమైన చేతివృత్తులు, కులవృత్తులు కనుమరుగు కాకుండా ప్రభుత్వం చేయూతనందించాలి. యాంత్రీకరణ మూలంగా చేతివృత్తులు, కులవృత్తులను వదిలి అనేక మంది నిరుద్యోగులుగా మారుతున్నారు. ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రత్యామ్నాయ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా భావించాలి.

–మాధవస్వామి, గోసానిపల్లె, డోన్

క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన



ఆర్టీఐపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం రైతు సేవా కేంద్రంలో గ్రామస్తులు, రైతులకు సమాచార హక్కు చట్టంపై ఏఓ కిరణ్ కుమార్ మంగళవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకునే అధికారమే సమాచార హక్కు అని తెలిపారు. సామాన్యుడికి కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 2005 అక్టోబర్ 12న సమాచార హక్కు చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని చెప్పారు. పౌరులు సమాచారం అడిగిన 30 రోజుల్లోపు అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారికి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మధు, మహమ్మద్, బెన్నీ రాజు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు అన్నదానం



రవ్వలకొండపై అన్నదానం చేస్తున్న రమాకాంత్‌రెడ్డి

బనగానపల్లె: బనగానపల్లె సమీపంలోని రవ్వలకొండపై అయ్యప్పస్వాములకు మంగళవారం అన్నదానం చేశారు. వీరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా ట్రస్ట్ చైర్మన్, అవుకు మండలం గుండ్లశింగవరం సర్పంచ్ కాటసాని రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ సభ్యులు నాగరాజువర్మ, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, వెంకట్రామిరెడ్డి, రాజారెడ్డి, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

చోరీకి గురైన విగ్రహాల అందజేత



ఆలయ కమిటీ సభ్యులకు విగ్రహాలను అందజేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈ ఏడాది జూలై 7వ తేదీ వినాయక, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పంచలోహ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. అక్టోబర్ 28వ తేదీ ఇద్దరు నిందితులను బెలుం గుహల వద్ద పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన దేవతా విగ్రహాలను రికవరీ చేశారు. మంగళవారం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ డి.వెంకటేశ్వరరావు పంచలోహ విగ్రహాలను అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు పోలూరు విజయ రాఘవ రావు, చిన్న కృష్ణ, బచ్చు సుబ్రమణ్యంలకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

పుట్ట పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: కార్తీక మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని బనగానపల్లె మార్గంలో వెలసిన పుట్ట పెద్దమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. అలాగే కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీదేవి, సిమెంట్ నగర్ గ్రామంలోని సుంకులా పరమేశ్వరి అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

చదువుతో పాటు క్రీడలూ అవసరం



డీఎస్పీని సత్కరిస్తున్న స్కూల్ కమిటీ

డోన్ టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. క్రీడా దినోత్సవం పురస్కరించుకుని శ్రీచైతన్య స్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం డీఎస్పీని స్కూల్ కమిటీ శాలువా, పూల మాలతో ఘనంగా సత్కరించింది. స్కూల్ ఏజీఎం సురేష్, ఆర్‌వి చౌదరి, ప్రిన్సిపాల్ ఉమా, డీన్‌లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–నంద్యాల రహదారిలోని రేవనూరు పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ఎస్‌ఐ భూపాలుడు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె, జమ్మలమడుగు, తదితర ప్రాంతాల వైపు వెళుతున్న వాహనాలను ఆపి రికార్డులు తనిఖీ చేశారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సూచించారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

బనగానపల్లె: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ మద్దయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు గుండం సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యా సంస్థల్లో 50 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, జవహర్, నాయకులు రఘురామిరెడ్డి, చంద్రశేఖర్, చెన్నయ్య, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదుకు అవకాశం

కోవెలకుంట్ల: ఓటు హక్కులేని యువతీ, యువకులకు కొత్తగా ఓటు హక్కు నమోదుకు అవకాశం కల్పించినట్లు బనగానపల్లె నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్ లెవల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 9,10, 23, 24వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. కొత్తగా ఓటు హక్కు నమోదుతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, తొలగింపులు, తదితర అంశాలకు



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డి

సంబంధించి ఓటర్లు ఫారం–6,7,8, 8ఏలను అందజేయవచ్చని పేర్కొన్నారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి





వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశాకార్యకర్తలు, బేతంచెర్ల: డాక్టర్ అలీమ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

డోన్ టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆశాకార్యకర్తలు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని చిన్న మల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారు సమావేశమయ్యారు. ఈనెల 18న నంద్యాలలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి శివరామ్, వేణుకుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు చిన్నమ్మ మాట్లాడుతూ.. గతంలో సమ్మె కాలంలో జరిగిన ఒప్పందం కుదిరి 9 నెలల అవుతున్నా జీఓలు విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని.. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని కోరారు. అనంతరం వైద్యాధికారి చెన్న కేశవులకు వినతి పత్రం అందజేశారు. నాయకులు సరళమ్మ, రాజేశ్వరి, వెంకటేశ్వరమ్మ, కళావతి ఉన్నారు.

బేతంచెర్ల: ఆశావర్కర్ల సమస్యలపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులు, యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పంద జీఓలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆశావర్కర్ల యూనియన్ నాయకురాలు సుజాత కోరారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం పీహెచ్‌సీలో డాక్టర్ అలీమ్‌కు ఆశా కార్యకర్తలు, సీఐటీయూ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు మధుశేఖర్ మాట్లాడుతూ.. 9 నెలలు కావస్తున్నా జీఓలు విడుదల చేయకపోవడంతో ఆశావర్కర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.

ఇతరులను ఆదుకోవడం మానవ ధర్మం

డోన్ టౌన్: సమాజంలో తోటి వారు కష్టాలు, ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవడం మానవ ధర్మం అని స్ఫూర్తి సంస్థ వ్యవస్థాపకుడు ఆలా మధు అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన చాకలి తాయన్న అనారోగ్యం కారణంగా కొద్ది నెలలుగా ఇంటికే పరిమితం అయ్యారు. కుటుంబ పోషణ భారంగా మారింది. దాతల ఆర్థిక సహాయంతో మంగళవారం బియ్యంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు రూ.వెయ్యి నగదు అందజేశారు. అనంతరం పట్టణానికి చెందిన బీకే నాయుడు జ్ఞాపకార్థం పద్మావతి వృద్ధాశ్రమం, రైల్వే



తాయన్నకు సరుకులు అందజేస్తున్న స్ఫూర్తి సభ్యులు

స్టేషన్ ప్రాంతాల్లో అన్నదానం చేశారు. స్ఫూర్తి సంస్థ సభ్యులు చంద్ర, భాస్కర్, నారాయణస్వామి, శివయ్య, శివ, రాజు ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

కొలిమిగుండ్ల: స్థానిక తాడిపత్రి రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక యూపీఎస్‌లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు కొత్తగా తయారు చేయించిన అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఆలయానికి అందజేశారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్వామిని అలంకరించి విశేష పూజలు చేశారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



కొలిమిగుండ్ల: శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో తిమ్మనాయనపేట ఆకాంక్ష స్పోర్ట్స్ ఆకాడమికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ సంస్థ సెక్రటరీ బత్తుల రాజేష్ మంగళవారం తెలిపారు. అండర్–17 విభాగం 1500 మీటర్ల పరుగులో లక్ష్మీకాంతి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 3వేల మీటర్ల రేస్‌వాక్‌లో శాలిని ద్వితీయ స్థానం, మూడు వేల మీటర్ల పరుగులో శాలిని తృతీయ స్థానంలో నిలిచారన్నారు. బాలుర విభాగంలో 5 వేల మీటర్ల రేస్‌వాక్‌లో మల్లి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు కోచ్ విజయ్‌కుమార్‌ను ఆకాంక్ష ఫౌండర్ విశ్వనాథం సాయి వంశీవర్ధన్ అభినందించారు.



పారుతున్న నిర్లక్ష్యం..!

కొత్తపేట అన్న క్యాంటీన్ సమీపంలో రోడ్డుపై చేరిన నీరు

డోన్: తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా కొత్తపేట అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాలు చిత్తడిగా మారాయి. రోడ్డుపై నీరు చేరడంతో ఆ మార్గంలో వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

రేషన్ షాపు సీజ్

ప్యాపిలి: పట్టణంలోని 10వ నంబర్ రేషన్ షాపును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ తహసీల్దార్ వెంకటనారాయణ, సీఐ సునీల్ కుమార్ రేషన్ షాపును తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో 118 కిలోల రేషన్ బియ్యం తూకంలో తేడా ఉన్నట్లు గుర్తించిన అధికారులు షాప్‌ను సీజ్ చేశారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్..?

- పింఛన్ నగదు స్వాహా చేయడంతో చర్యలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని 1వ గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్‌ను జిల్లా అధికారులు మంగళవారం సస్పెండ్ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. రెండేళ్ల క్రితం పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడి రూ. 2.11 లక్షలను స్వాహా చేసినట్లు అప్పట్లో అధికారులు గుర్తించారు. ప్రభుత్వ సొమ్మును తిరిగి చెల్లించాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఇటీవల మండలస్థాయి అధికారులు జిల్లా అధికారులకు నివేదించారు. ఈ మేరకు సురేష్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజకుమారి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఎంపీడీఓ వరప్రసాదరావును వివరణ కోరగా పింఛన్ డబ్బులు వాడుకున్న విషయం వాస్తవమేనని.. చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు నివేదించామని తెలిపారు. నివేదిక ఆధారంగా వెల్ఫేర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు సమాచారం. అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

శైవక్షేత్రాల్లో కార్తీక పూజలు



ప్రత్యేక అలంకరణలో శివుడు

డోన్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని నియోజకవర్గంలోని శైవ క్షేత్రాల్లో పరమ శివునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వేకువజామునే పెద్ద సంఖ్యలో మహిళలు తలస్నానం చేసి శివాలయాలకు చేరుకుంటున్నారు. పుష్పం, ఫలంతో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయాల ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తూ తమ కోరికలను స్వామి వారికి విన్నవించుకుంటున్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న నరసింహారెడ్డి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను మంగళవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ పశువైద్యాధికారి శివారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, వాల్మీకి సంఘం నాయకుడు సుబ్బయ్య, ఉపాధి హామీ పథకం మేటి రాములమ్మ, నరసింహులు, మహేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈ–స్టాంప్‌ల కొరత

- పట్టించుకోని అధికారులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ స్టాంప్‌ల(పేపర్) కొరత కారణంగా విద్యార్థులు, రైతులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి అగ్రిమెంట్లు, రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందాలన్నా, విద్యార్థుల పేర్లలో మార్పులు, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ చేసుకోవాలన్నా అఫిడవిట్‌కు కేవలం రూ.10 ఈ–స్టాంప్ ఉంటే సరిపోతుంది. అయితే ఈ స్టాంప్ వెండర్ల వద్ద రూ.10, రూ.20. రూ.50, రూ.100, రూ.200ల ఈ స్టాంప్‌లు తీసుకునేందుకు వెళితే ఇవ్వడంలేదు. రిజిస్ట్రేషన్లకు మాత్రమే ఈ స్టాంప్‌లను స్టాంప్ వెండర్లు విక్రయిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్లకు కూడా పలుకుబడి ఉన్నవారికే ఈ స్టాంప్‌లను వెండర్లు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా



బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కొందరు ఈ స్టాంప్‌లు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు. ఈ విషయంపై సబ్ రిజిస్ట్రార్ శ్రీధర్ గుప్తాను వివరణ కోరగా.. ఈ స్టాంప్‌ల స్టేషనరీ తమకు సంబంధం లేదని, ఈ విధానం ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, విద్యార్థులు కోరుతున్నారు.

వేతనాల కోసం వినతి



వినతి పత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

డోన్ రూరల్: 104 ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని ఏపీజీఈఏ ఉద్యోగుల సంఘం నాయకుడు కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తబురు ప్రాథమిక వైద్యశాల వద్ద ఏపీజీఈఏ డోన్ తాలుక అధ్యక్షుడు చంద్రబాబుకు 104 ఉద్యోగులు వినతి పత్రం అందించారు. జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇటీవల హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను జీతాలకు లింక్ పెట్టడాన్ని తప్పుపట్టారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌లో చాలా లోపాలు ఉన్నాయని, పాత పద్ధతి ప్రకారమే జీతాలు చెల్లించాలని కోరారు. డీఈఓ వెంకట్, హనీఫ్, జయచంద్ర, డ్రైవర్ తిప్పన్న, ఓబులేష్, నారాయణ పాల్గొన్నారు.

వేసవిలోగా జలదుర్గం చెరువుకు నీరు

ప్యాపిలి: వచ్చే వేసవి నాటికి జలదుర్గం చెరువును నీటితో నింపుతామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జలదుర్గం చెరువును మంగళవారం ఆయన పరిశీలించారు. జలదుర్గం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. చెరువులను నింపి రైతులకు సాగునీటి కష్టాలను తొలగిస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నరసింహులు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ భారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే

సస్యరక్షణతో అధిక దిగుబడులు



ఆర్‌ఎస్ రంగాపురంలో పంటను పరిశీలిస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

బేతంచెర్ల: సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు సాగు చేసిన కంది, శనగ, జొన్న పంటలను పరిశీలించారు. ప్రస్తుతం కంది పంటలో గూడు పురుగు అధికంగా ఉందని, నివారణకు ఎమ్మమెసిటిన్ బెంజొట్ పురుగు మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో పిండి నల్లి పురుగు నివారణకు ప్రొఫినోపాస్ లేదా థైమిథాక్సిమ్ మందును పిచికారీ చేయాలన్నారు.

రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ అన్నారు. మంగళవారం మండలంలోని బిజనవేముల, వెలగటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఏఓ మాట్లాడుతూ.. గ్రామ యూనిట్‌గా శనగ, మండల యూనిట్‌గా వరి, జొన్న, మినుము, జిల్లా యూనిట్‌గా వేరుశనగ, ఉల్లి పంటలను దిగుబడి ఆధారిత పంటల బీమాలో నోటిఫై చేయడం జరిగిందన్నారు. ఆయా పంటలు సాగు చేసిన రైతులు స్వచ్ఛందంగా బ్యాంకులు, కామన్‌సర్వీస్ సెంటర్లు, గ్రామ సచివాలయాల్లో ప్రీమియం చెల్లించి రసీదులు తీసుకోవాలని పేర్కొన్నారు.

మండలంలో శనగ పంట సాగు చేసిన రైతులు పురుగు మందుతోపాటు తప్పనిసరిగా తెగులు మందులైన సాఫ్‌పౌడర్, హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ కలిపి పిచిచారీ చేయడం ద్వారా పురుగులు, తెగుళ్ల బారినుంచి పంటను రక్షించుకోవచ్చని వివరించారు. పశువైద్యాధికారి కృష్ణకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



వెలగటూరులో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు